క్లుప్తంగా

ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి



పటాన్‌చెరు: నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీకి గురువారం కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బొల్లారం మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మధుసూదన్‌రెడ్డి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కోతకు గురైన రోడ్డు పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధి చల్లగిద్దతండా వద్ద రోడ్డు కోతకు గురైంది. ఖేడ్– సిర్గాపూర్ రోడ్డు విస్తరణలో భాగంగా కాల్వలు తవ్వడంతో వరదనీరు ఉధృతితో తారురోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. సూచికగా ఇరుపక్కల పంచాయతీ కార్యదర్శి మిస్కీన్ చెట్లు కొమ్మలను అడ్డుగా వేయించారు. గురువారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించి రాకపోకలను పునరుద్ధరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఖేడ్‌లో రెస్క్యూటీమ్ సేవలు



సిద్ధంగా ఉన్న రెస్క్యూటీమ్

నారాయణఖేడ్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఖేడ్‌కు రెస్క్యూ టీంతో పాటు సహాయ కార్యక్రమాల కోసం అవసరమైన బోట్లు, సామగ్రిని పంపించింది. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో వారికి వసతిని కల్పించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 101కు లేదా అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 8712699393, 8712699392 నంబర్లలో సంప్రదించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు.

చెత్త కాల్చివేతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం బహిరంగ ప్రదేశాల్లో చెత్త, ప్లాస్టిక్, తదితర వ్యర్థాల కాల్చివేతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కిషన్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చివేతతో పర్యావరణంతో పాటు ప్రజా జీవనానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. అనారోగ్యాలు దెబ్బతినే అవకాశం ఉందని బహిరంగ కాల్చివేత నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ మేరకు కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్ అధికారులతో మున్సిపాలిటీలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీసీబీ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్, మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్ఓ నర్సింలు, సీఐ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ దేవదాస్ పాల్గొన్నారు.

పాతళగంగ పైపైకి



బోరు నుంచి ఉబికివస్తున్న నీరు

జహీరాబాద్ టౌన్/న్యాల్‌కల్: భారీ వర్షాలకు నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెరిగాయి. అడుగంటిన బోరు బావుల్లో నీరు పైకి ఉబికివస్తుంది. వ్యవసాయ బావుల్లో కూడా నీటి మట్టం పెరిగింది. కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల కారణంగా బోరు బావుల నుంచి పాతలగంగా పైపైకి వస్తుంది. పట్టణ సమీపంలోని పస్తాపూర్ గ్రామ రైతు సీఎం శంకర్‌రెడ్డి పొలం వద్ద గల బోరు నుంచి నీరు ఉబికివస్తుంది. జాడిమల్కాపూర్, ఖంజమల్‌పూర్ తదితర గ్రామాల్లో కూడా వ్యవసాయ బోరు బావుల నుంచి నీరు పైకి ఉబికి వస్తుంది. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామంలో ఎర్రరాయి నుంచి నీరు బయటకు చిమ్ముతుంది. పలు వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగిపోయింది.

అధ్వాన రోడ్లు.. ప్రయాణం పాట్లు

గుంతలమయంగా రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి



ఇంద్రేశం, జిన్నారం వైపు వెళ్లే రోడ్డు



చిట్కుల్‌లో రామరాజునగర్ మీదుగా లోపలి కాలనీలకు వెళ్లే రోడ్డు

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఆర్అండ్‌బీ రోడ్లు చాలా కాలం క్రితమే అవసానదశకు చేరాయి. అధిక పన్నులు వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీ, మున్సిపాల్టీల్లోనూ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా రోడ్లు బాగోలేవనే చెబుతున్నారు. లింగంపల్లి చౌరస్తా నుంచి గణేష్ గడ్డ వరకు జాతీయ రహదారి నిర్మాణం కొనసాగుతుండటంతో జాతీయ రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. గంటల తరబడి ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. ముత్తంగి చౌరస్తా వద్ద ఓఆర్ఆర్ నుంచి కిందికి దిగే వాహనాలతో ట్రాఫిక్ జామవుతుంది. రుద్రారంలో గీతం యూనివర్సిటీ కాలేజీ బస్సులు, గణేష్ గడ్డ వైపు తోషిబా, ఇతర భారీ పరిశ్రమలకు చెందిన వాహనాలు, లక్డారం క్రషర్ల నుంచి కంకర తోలే వాహనాలతో జాతీయ రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్ ఉంటుంది. ఇదిలా ఉండగా పటాన్‌చెరు–భానూరు వెళ్లే రోడ్డు వర్షాలతో దారుణంగా తయారైంది. ఈ రోడ్డు మీదుగా పాశమైలారం పారిశ్రామికవాడకు వెళ్లాలి. ముంబాయి రహదారికి బెంగళూరు హైవేకి మధ్యలో ఇది అను సంధానరోడ్డుగా కూడా ఉంది. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

భయంగా భయంగా ప్రయాణం

జిన్నారం నుంచి కొడకంచి, మాదారం, శివానగర్ రోడ్ల మీదుగా పటాన్‌చెరుకు వచ్చే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుత వర్షాలకు మరింత పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ మూడు ప్రధాన రహదారులు ఘోరంగా మారాయి. రోడ్లు బాగోలేకపోవడంతో జిన్నారం ప్రాంతంలోని కాజిపల్లి, గడ్డపోతారం బొల్లారం పారిశ్రామికవాడలకు వెళ్లే భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.

అన్ని మున్సిపాలిటీలోనూ బురద రోడ్లే

నియోజకవర్గంలోని బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఇస్నాపూర్ ఇంద్రేశం మున్సిపాలిటీల్లో చిన్న గల్లీలోనూ రోడ్లు పాడైయ్యాయి. రామచంద్రాపురం భారతీనగర్ పటాన్‌చెరు మున్సిపల్ డివిజన్ల పరిధిలో కూడా రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. పటాన్‌చెరు పట్టణంలో మార్కెట్‌లో వర్షాలతో బురదమయంగా మారింది. బురదలోనే కూరగాయల క్రయ విక్రయాలు సాగుతున్నాయి. మొత్తంగా నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్, హెచ్ఎండీఏ రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. అన్ని శాఖలకు సంబంధించిన రోడ్లు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లన్నీ అభివృద్ధి చేస్తాం..



పటాన్‌చెరు ఇంద్రేశం రోడ్డుకు సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నా.. అన్ని మున్సిపల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ రోడ్ల అభివృద్ధి చేపడతాం. ప్రధాన రోడ్లను హెచ్ఎండీఏ నిధులతో అభివృద్ధి చేయిస్తాం. భానూర్ రోడ్డును నాలుగు లైన్‌లుగా మారుస్తున్నాం. అమీన్‌పూర్ రోడ్డు అభివృద్ధికి నిధులు ఉన్నాయి. పనులు సాగుతున్నాయి.

– గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న యాదగిరి

సంగారెడ్డి : వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం. యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో భగత్‌సింగ్ నగర్‌లో సీపీఎం పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డిలోని భగత్‌సింగ్‌నగర్‌లో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి నీళ్లు రావడంతో ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే పునరావాస కేంద్రం కల్పించాలన్నారు. ఇండ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి బెడ్ షీట్స్, దుప్పట్లు, మంచినీరు, మెడిసిన్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మంజీరా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జీరిన, భాయ్, శివ, సురేష్, శ్రీనివాస్, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

చరిత్రహీనుడు చంద్రబాబు



నివాళులర్పిస్తున్న రాంచందర్ తదితరులు

జహీరాబాద్ టౌన్: విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఆందోళన చేస్తున్న వారి ప్రాణాలు బలిగొన్న చంద్రబాబు చరిత్రహీనుడుగా మిగిలిపోయారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాంచందర్ అన్నారు. విద్యుత్ అమరవీరుల వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రామిక్‌భవనంలో వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంక్ విధానాలను అమలు చేస్తున్న అప్పటి సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న వారిపై కాల్పులు జరిపించారన్నారు. పోలీసుల కాల్పుల్లో కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలు ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. వీరి స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, తుల్జారాం, జయమ్మ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

సదాశివపేట(సంగారెడ్డి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా జరిగిన ఉద్యమంలో బషీర్‌బాగ్ సెంటర్‌లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు గురువారం సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పట్టణశాఖ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్ల మరమ్మతులు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దుర్గయ్య తదితరులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిన్నడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు దుర్గయ్య ఎంపీడీఓను కోరారు. బీజేపీ నాయకులతో కలిసి గురువారం ఎంపీడీఓ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని హుగ్గెల్లి, మల్చెల్మ, ఆనేగుంట, రాయిపల్లి(డి), బూచినెల్లి, అల్గోల్, బుర్దిపాడ్, షేకాపూర్ గ్రామాల రోడ్లు వర్షాలకు దెబ్బతిని అధ్వాన్నం తయారైయ్యాయని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల గురించి పట్టించుకునే వారు కరువైయ్యారని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేనిట్లయితే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు విశ్వనాథ్ యాదవ్, గాజుల జగన్నాథం, నర్సింలు, ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, అంజన్న పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉపేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.11 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని 8500376267 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వంతెనను పరిశీలిస్తున్న అంజయ్య

రాయికోడ్(అందోల్): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ జి.అంజయ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దప్ప పాటిల్ పేర్కొన్నారు. మండలంలోని యూసుఫ్‌పూర్, కుసునూర్, ఇటికేపల్లి తదితర గ్రామాల వాగులను తహసీల్దార్ ఆశాజ్యోతి, నాయకులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయా గ్రామాల వాగులు ఉధృతిగా ప్రవాహిస్తున్నందున ప్రజలు వాగులు దాటే సాహసం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చైతన్యకిరణ్, నాయకులు నర్సింలు, పోలీసు, వ్యవసాయ, పంచాయతీ శాఖల సిబ్బంది ఉన్నారు.

జిన్నారం కమిషనర్‌గా తిరుపతి



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా తిరుపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. జోగిపేట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

సంక్షిప్త వార్తలు

◆ **వేయి ఎకరాలకుపైగా పంట నష్టం**

జహీరాబాద్: భారీ వర్షాలకు డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 1328 ఎకరాల్లో 940 మందికి రైతులకు సంబంధించి పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి పేర్కొన్నారు. గురువారం ఇందుకు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. న్యాల్‌కల్ మండలంలో 661 మంది రైతులకు సంబంధించి 926 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. జహీరాబాద్ మండలంలో 390 ఎకరాల్లో 267 మందికి రైతులకు సంబంధించి పంట నష్టం జరగగా, ఝరాసంగం మండలంలో 12 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. 484 ఎకరాల్లో పత్తి పంట, 377 ఎకరాల్లో సోయాబీన్, 11 ఎకరాల్లో మొక్కజొన్న, 180 ఎకరాల్లో పెసర, 201 ఎకరాల్లో మినుము, 8 ఎకరాల్లో అల్లం, 28 ఎకరాల్లో కూరగాయలు, 14 ఎకరాల్లో బొప్పాయి పంటలకు నష్టం జరిదిందని వివరించారు.

◆ **మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గురువారం వారిని కోర్టులో హాజరుపరచగా నలుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి, మరో ఇద్దరికి రూ.1500 చొప్పన జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

◆ **క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా గురువారం క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు చెరువుకట్ట కుంగిపోవడంతో తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్‌తో పాటు పలుశాఖల అధికారులు సందర్శించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సహాయ చర్యల్లో మైహోమ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు అలుగు పారింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

◆ **నర్సరీ పరిశీలన**

మునిపల్లి(అందోల్): హరితహారం పథకంలో నాటేందుకు నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను గురువారం జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సాయిబాబా పరిశీలించారు. మండలంలోని మగ్దుంపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

◆ **శిథిల నివాసాల కూల్చివేత**

నారాయణఖేడ్: ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న నివాసాలతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తేవడంతో జేసీబీతో నివాసాలను కూల్చివేశారు. దీంతో ఆయా కాలనీల్లో ప్రమాదం తప్పినట్లయ్యింది. దీంతో పాటు పట్టణంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు, మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త తొలగించి వరద ఉధృతి ఆగకుండా చేశారు. ఆయా పనులను కమిషనర్ జగ్జీవన్ పర్యవేక్షించారు.

◆ **రూ.25 వేలు నష్ట పరిహారం చెల్లించాలి**

కొండాపూర్(సంగారెడ్డి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 25 వేల నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మారేపల్లిలో వర్షాలకు నీట మునిగిన పంటలను పరిశీలించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ 25 వేలు నష్ట పరిహారం చెల్లించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా కొరత లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మల్లేశం, అనంతయ్య, రాజు, అశోక్, రాములు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



కార్మికులకు రెయిన్ కోట్లు అందిస్తున్న సభ్యులు

సంగారెడ్డి : కార్మికుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యమని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వాసవీ మాఇల్లు ఆధ్వర్యంలో 150 మంది మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వాసవి మా ఇల్లు ఆధ్వర్యంలో కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వాసవి మా ఇల్లు సంస్థ వ్యవస్థాపకులు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు వర్షంలో పనిచేస్తున్నారని వారి కోసమే పంపిణీ చేసినట్లు చెప్పారు. మా ఇల్లు ఆధ్వర్యంలో మరెన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు . కార్యక్రమంలో వాసవి మా ఇల్లు సంస్థ కార్యదర్శి తోపాజి హరీష్, సభ్యులు మ్యాడంరాధా కిషన్, కొంపల్లి విద్యాసాగర్, జూలకంటి బుచ్చిలింగం, అమేటి కిట్టు, నామ భాస్కర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జి పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్‌పై మూతలు తప్పనిసరి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



వర్షం నీటిని తొలగిస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: మ్యాన్ హోల్స్‌పై కచ్చితంగా మూతలు వేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సూచించారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు. చైతన్యనగర్ కాలనీ, జేపీకాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బందిని వెంట పెట్టుకొని పరిస్థితులను సమీక్షించారు. రోడ్లపై నిలిచిన వర్షం నీటిని తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావొద్దన్నారు. రోడ్లపై వర్షం నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, మ్యాన్‌హోల్స్ పైకప్పులు వేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నైపుణ్యశిక్షణతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న టాస్క్ ట్రైనర్ మార్క్ లూయిస్

జహీరాబాద్ టౌన్: నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని టాస్క్ ట్రైనర్ మార్క్ లూయిస్ అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో గురువారం శిక్షణ తరగతులు ప్రారంభమైయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే శిక్షణ తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైనర్ మాట్లాడుతూ.. శిక్షణ తరగతుల ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్, వే ఆఫ్ అండర్ స్టాండింగ్, లిజనింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్ హరికుమార్ మాట్లాడుతూ.. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్లు నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

గణేశ్ చతుర్థిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథులకు భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా ప్రతిష్ఠించి విగ్రహాల వద్ద ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఘ్నాలను తొలగించి విజయపథంలో నడిపించాలని వేడుకున్నారు. గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఐక్యత, భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు జరగాలని కోరారు.



పటాన్‌చెరు: ణనాథునికి పూజలు చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



జిన్నారం(పటాన్‌చెరు): గణనాథుడికి పూజలు చేస్తున్న యువకులు



సంగారెడ్డి : రామ మందిరంలో పూజలు చేసిన జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు



సదాశివపేట పట్టణం పరిధి హనుమాన్ మందిరంలో..



పటాన్‌చెరు: మండపం వద్ద పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేత నీలం



రామచంద్రాపురం డివిజన్ పరిధిలో..

ఓటర్ల జాబితా ప్రదర్శన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీ కేంద్రాల్లో గురువారం ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ సుభాష్ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల జాబితాలు స్థానిక ఓటర్ల పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 లోపు పంచాయతీ సెక్రటరీలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2న పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

కంది మండలంలో..

కంది(సంగారెడ్డి): కంది మండలంలో 37,823 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు గురువారం కందిలోని మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రదర్శించిన ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 28 నుంచి 30 వరకు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు .

జహీరాబాద్ పరిధిలో..

జహీరాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో గల గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వార్డుల వారిగా ఓటర్ల జాబితాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.



కంగ్టి: ఓటర్ జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీఓ సుభాశ్ తదితరులు



జహీరాబాద్: శేఖాపూర్ గ్రామ కార్యాలయం వద్ద